నాడు అధ్వానం... నేడు అమోఘం

- నాడు-నేడు పథకంలో మారిన పాఠశాలల రూపురేఖలు
- కార్పొరేట్ స్థాయి హంగులతో ప్రభుత్వ పాఠశాలలు
- నియోజకవర్గంలో రెండు ఫేజ్‌ల్లో రూ.72.65 కోట్లు


కార్పొరేట్‌ను తలదన్నేలా నందిగామ ఆదర్శ పాఠశాల


సత్తెనపల్లి: సాధారణంగా ప్రభుత్వ పాఠశాలలంటే ఓ చిన్న చూపు ఉండేది. ముఖ్యంగా అక్కడి సౌకర్యాలపై అసహనంతో కష్టమైనా పేదలు సైతం తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపేవారు. ఇదంతా 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడక ముందు మాట. 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక తీసుకొచ్చిన నాడు-నేడు పథకం ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చింది. అప్పట్లో అధ్వాన్నంగా ఉండే పాఠశాలలను... నేడు అమోఘం అనేంతలా మార్చి చూపించారు. అధునాతన వసతులతో పాటు నాణ్యమైన విద్యను పేదలకు అందించాలనే తపనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన నాడు-నేడు పథకం పేద విద్యార్థులకు వరంగా మారింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మార్చారు. నియోజకవర్గంలో 231 పాఠశాలలు ఉండగా ఫేజ్-1లో 631 పనులు, ఫేజ్-2లో 881 పనులు చేపట్టారు. రెండు ఫేజ్‌ల్లో రూ.72.65 కోట్లు ఖర్చు చేశారు. దీంతో విద్యార్థులకు అవస్థలు తీరి హాయిగా విద్యనభ్యసిస్తున్నారు.


భట్లూరు ఎంపీపీ పాఠశాల ముఖ ద్వారం


నకరికల్లు కేజీబీవీ పాఠశాల



రామాపురం ఎంపీపీఈ పాఠశాలలో చేతులు కడుగు స్థలం


సుగాలి కాలనీ జెడ్పీ పాఠశాలలో తరగతి గదిలో విద్యార్థులు


రామాపురం ఎంపీపీఈ పాఠశాలలో బాలుర యూరినల్స్ పాయింట్

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన కార్యకర్త



సత్తెనపల్లి: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సత్తెనపల్లి మండల పర్యటనలో మంగళవారం రెంటపాళ్ల గ్రామంలో జనసేన పార్టీ నుంచి కార్యకర్త మాదిశెట్టి వెంకటేశ్వరరావు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరారు. వెంకటేశ్వరరావుకు మంత్రి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పాకాలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కరరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్‌బీ, జెడ్పీటీసీ సంకటి నాగేశ్వరమ్మ, నల్లబోతు శివనారాయణ, సర్పంచ్ ఏకుల మనీష, నాయకులు కొర్లకుంట నాగమల్లేశ్వరరావు, పల్లెగాబ్రియేలు, తదితరులు ఉన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ తోఫా



పెదకూరపాడు(అమరావతి): స్థానిక కిరోసిన్ షేక్ మీరస గారి కుమారుడు షేక్ అహ్మద్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ పండుగ పురస్కరించుకుని 50 ముస్లిం పేద కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. పేద ముస్లిం కుటుంబాల వారు సంతోషంగా రంజాన్ పండుగ జరుపుకోవడానికి నిత్యావసర సరుకులతో కూడిన రంజాన్ తోఫా జకాత్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ అహ్మద్, మాజీ అంజుమాన్ ప్రెసిడెంట్ షేక్ మహమ్మద్ షరీఫ్, నాయబ్ ముస్తఫా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

సత్తెనపల్లి: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి, సలహాలు, సూచనలు అందించేందుకు ఈ నెల 10న పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జి.ఎస్.వి.వి.కుమార్ మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 11.00 గంటల నుంచి 12.00 గంటల వరకు జరుగుతుందన్నారు. డిపో పరిధిలోని ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు, మెరుగైన సేవలకు 9959225429 నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఉగాది పండుగ పురస్కరించుకుని 2024-25 ఏడాదికి ఉపాధి పనులు మంగళవారం ప్రారంభించారు. బ్రాహ్మణపల్లిలో ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు ఉపాధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ సగటు వేతనం రూ.272 నుంచి రూ.300లకు పెంచడం జరిగిందని ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయాన్నే పనులు ప్రారంభించాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ అల్లాభక్షి, ఏ నాగార్జున, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, మేట్లు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



సత్తెనపల్లి: వేసవి కాలంలో తాగునీటిని అందించటం అభినందనీయమని పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణంలోని గాంధీచౌక్ సెంటర్లో గల వినాయకుని గుడివద్ద త్రిపురమల్లు శేషగిరిరావు ధర్మపత్ని రామతులశమ్మ చారిటిబుల్ ట్రస్ట్ తరపున వారి కుమారులు మల్లేశ్వరరావు, అంబరీష్ ఆర్థిక సహకారంతో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం నిర్వహిస్తున్న మంచి నీటి చలివేంద్రం మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘ పట్టణ అధ్యక్షుడు చిల్లంచర్ల కళ్యాణ్, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు శింగరి మధుసూధనరావు, గోశాల అధ్యక్షుడు మాడా నాగ రమేష్, చలివేంద్ర సంఘ సభ్యులు కనమర్లపూడి సుబ్బారావు, కొత్తూరి విశ్వేశ్వరరావు, చిలకల శ్రీనివాసరావు, నోముల వెంకటరమణ, దేవరపల్లి మల్లేశ్వరరావు, దేవరశెట్టి రవికుమార్, తొమ్మండ్రు సత్యనారాయణ, కాపుగంటి సాయిసుమంత్, జవ్వాజి రవి, కొత్త లక్ష్మయ్య, దేవతి సుబ్బారావు, డి.శ్రీనివాసరావు, వాసవి క్లబ్ సభ్యులు కొప్పురావూరి కాశీ, పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్న చేరికలు


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: వైఎస్సార్‌సీపీలో చేరికల పరంపర కొనసాగుతోంది. పారదర్శంగా కొనసాగుతున్న సంక్షేమ పథకాల అమలు, గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి చూసి టీడీపీ, జనసేన పార్టీల నుంచి స్వచ్ఛందంగా వచ్చి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. తాజాగా గ్రంథశిరి గ్రామానికి చెందిన సరిమల్ల మరియదాసు సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీలో చేరారు. కస్తల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నేర్నబోయిన మంగయ్య, దుద్దులూరి పెద్ద నరసింహారావు, నల్లగొర్ల ఆంజనేయులు, కొల్లి బ్రహ్మం, దుద్దుకూరి రాజేష్, కొల్లి వెంకయ్య, దుద్దుకూరి చిన్న ఏడుకొండలు, బత్తుల శివయ్య తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ అందరికీ అండగా ఉంటానన్నారు. మరో నెల రోజుల పాటు వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కష్టపడితే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని, తాను ఎమ్మెల్యే అవుతానని, మరో అయిదు సంవత్సరాల పాటు మీ అందరికీ అందుబాటులో ఉంటూ సేవ చేసుకుంటానని భరోసా ఇచ్చారు.

వైభవంగా ఉగాది వేడుకలు

- ప్రత్యేక పూజలకు పోటెత్తిన భక్తులు
- పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం

సత్తెనపల్లి: తెలుగు సంవత్సరం శ్రీ క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఉగాది పర్వదిన వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. తెలుగువారి మొదటి పండుగ తెలుగు సంవత్సరాది ఉగాది కావడంతో పట్టణం, మండలంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభకృత్ నామ సంవత్సరం ముగిసి చైత్ర శుద్ధ పాడ్యమి మంగళవారం క్రోధి నామ సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకొని తెలుగు ప్రజలు వేకువ జామునే పూజలు చేశారు. రైతులు పొలాలకు వెళ్లి ఏరువాక నిర్వహించారు. ఇంటి ముందు రంగవల్లులు వేసి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. పులుపు, కారం, తీపి, వగరు, ఉప్పు, చేదు ఈ ఆరు రుచుల కలయికే ఉగాది పండుగ అని పలు ఆలయాల్లో పూజారులు తెలిపారు. ఈ సందర్భంగా షడ్రుచుల ఉగాది పచ్చడి భక్తులకు పంపిణీ చేశారు. ఇందులో ఉన్న ఒక్కో రుచి మానవ జీవితంలోని ఒక్కో భావానికి ప్రతీకగా చెప్పారు. పట్టణం, మండలంలోని పలు దేవాలయాల్లో కొత్త సంవత్సరం పురస్కరించుకొని వేద పండితులు పంచాంగాన్ని పఠించారు. ఆయా పంచాంగ శ్రవణాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఘనంగా ఉగాది వేడుకలు

అచ్చంపేట: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను గ్రామాలలో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచే భక్తులు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక గ్రామ దేవత అచ్చమ్మ పేరంటాళమ్మ తల్లి దేవాలయంలో గత రెండు రోజులుగా ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా విభాగం వారిచే లలిత, గాయత్రి అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయం వద్ద పొంగళ్లు పొంగించి అమ్మవారికి నివేదించారు. విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. చామర్రులోని వినాయకుని దేవాలయంలో ఉగాది ఉత్సవాలు జరిగాయి. ఇంద్రగంటి సుబ్బయ్యశాస్త్రి పంచాంగ శ్రవణ కార్యక్రమం చేపట్టారు.

కొండకు పోటెత్తిన భక్తులు

రాజుపాలెం: ఉగాది పండుగ పురస్కరించుకుని పల్నాడు తిరుపతిగా పేరు గాంచిన దేవరంపాడు నేతి వెంకన్న స్వామి కొండకు భక్తులు మంగళవారం పోటెత్తారు. పెదనెమలిపురి శ్రీనివాస శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచే గాక, సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దేవరంపాడు కొండకు విచ్చేసి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. గోవింద నామ స్మరణతో కొండ మారుమోగింది. కోనేటి రాయుడికి కోటి దండాలు అంటూ నీరాజనాలు అందించారు. భక్తులు స్వామి వారికి పొంగళ్లు సమర్పించారు. పశు సంపదను కాపాడాలని స్వామి వారికి నెయ్యిని సమర్పించి మొక్కుకున్నారు.

హుండీల లెక్కింపు

ఉగాది పర్వదినం పురస్కరించుకుని దేవాలయంలోని అన్ని హుండీలను లెక్కించగా రూ.10,67,067 వచ్చినట్లు ఈవో గుర్రం శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం ఫెస్టివల్ అధికారి వి.లీలావతి, దేవస్థానం కమిటీ చైర్మన్ శ్యామకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో వద్దవల్లి వేంకటేశ్వరుడు


ప్రత్యేక పూజలందుకున్న అచ్చమ్మ పేరంటాళమ్మ

నీలంపాటి అమ్మవారి ఆలయంలో మంత్రి అంబటి

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో ఉగాది పర్వదినం పురస్కరించుకొని నీలంపాటి అమ్మవారి ఆలయంలో జరిగిన పూజల్లో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి జెండా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ ఇందూరి నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


విశేష అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

క్రోసూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉగాది వేడుకలు

క్రోసూరు: మండల కేంద్రం క్రోసూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. వేద పండితులతో పంచాంగ శ్రవణం నిర్వహించారు. పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలందరూ క్రోధి నామ సంవత్సరంలో సుఖసంతోషాలతో, పాడిపంటలతో, శుభాలు జరగాలని, ప్రతి ఇల్లు కళకళలాడాలని ఆ దేవుని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం పండితులను సత్కరించారు. పంచాంగ శ్రవణంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు ఖాయమని, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు విజయం సాధిస్తారని పండితులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణి వసంతకుమారి, కుమారుడు కల్యాణ్‌చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో ఉగాది పూజలు...

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది పండుగ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. క్రోసూరులోని సాయిబాబా మందిర 24వ వార్షికోత్సవ మహోత్సవం ఉగాది పర్వదినాన నిర్వహించటం జరిగింది. ఉదయం నుంచి భక్తులు బాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ నిర్వహించింది. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బాబా మందిరానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా స్థానిక యోగానంద లక్ష్మీనరసింహస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, అభయాంజనేయస్వామి ఉత్సవాన్ని క్రోసూరులో నిర్వహించారు. అర్చకులు రొంపిచర్ల రమేష్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఉగాది పర్వదినం నాడు స్వామి వారి తిరునాళ్ల నిర్వహిస్తారు. అర్చకులు ఫణీంద్ర శర్మ ఆధ్వర్యంలో విశేష ద్రవ్యాలతో స్వామి వారికి అభిషేకాలు చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంతో పాటు సమీప గ్రామాల నుంచి తరలివచ్చిన మహిళలు పొంగళ్లు పొంగించారు. స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. స్వామి వారి 32వ వార్షిక వేడుకలు పురస్కరించుకొని గ్రామంలోని శ్రీరామ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.


క్రోసూరు సాయిబాబా మందిరంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రత్యేక పూజలు


క్రోసూరులో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి గ్రామోత్సవం


క్రోసూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శంకరరావు ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు


శ్రీరామ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన


వాసవి కన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపంలో పంచాంగ శ్రవణం


దేవరంపాడు కొండకు పోటెత్తిన భక్తులు

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి

అమరావతి: కార్యకర్తలు, నాయకులు వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని చావపాడు, పెదమద్దూరు గ్రామాలలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు ఇంటింటికి తిరిగి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని వారు పొందిన లబ్ధిని వివరించాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన పథకాల గురించి, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ప్రజలకు చేసిన మోసాలను వివరించాలన్నారు. ఎన్నికలకు సమయం చాలా తక్కువ ఉందని ప్రతి కార్యకర్త ఒక సైనికుని వలె గ్రామ స్థాయిలో అన్ని సామాజిక వర్గాలను కలుపుకుని పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. టీడీపీ కుతంత్రాలు, కుట్రలకు పాల్పడే అవకాశం ఉందని కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తొలుత చావపాడు గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, శంకరరావుకు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఈద్పుగంటి కరుణకుమారి, జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, చావపాడు ఉప సర్పంచ్ పెద్దిబోయిన బాలయ్య, గ్రామ పార్టీ నాయకులు చిలకా సాంబయ్య, చిలకా జోజిస్వామి, పెద్దిబోయిన వెంకటేశ్వరరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


చావపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నంబూరు వసంతకుమారి

బెల్లంకొండలో ఇఫ్తార్ విందు

బెల్లంకొండ: మండలం కేంద్రం బెల్లంకొండలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం మసీద్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విందులో వివిధ గ్రామాల ముస్లింలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ముస్లిం సోదరులతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం విందుకు హాజరైన వారికి ఎమ్మెల్యే స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మ, వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ అహ్మద్ పాషా, సిరిపురం మేస్త్రీ, మహమ్మద్ షరీఫ్, మౌలాలి, బడాబచ్చా, రహమాన్, గడిపర్తి బాబు, చావలి పెద వెంకటేశ్వర్లు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న మండల నాయకులు

రొంపిచర్ల రైల్వేస్టేషన్‌లో దొంగల హల్‌చల్

రొంపిచర్ల: స్థానిక రైల్వే స్టేషన్‌లో సోమవారం అర్ధరాత్రి దొంగలు కాపర్ వైర్‌ను దొంగిలించారు. సుమారు పది మంది దొంగలు స్టేషన్‌లో ఉన్న వారిపై రాళ్లు విసిరారు. దీంతో అక్కడున్న వారు రొంపిచర్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దొంగతనానికి వచ్చి కాపర్ వైర్ దొంగిలిస్తున్న వారిని వీడియో తీశారు. వీడియో ఆధారంగా ఈ దొంగతనంలో పది మంది పాల్గొన్నట్లు తెలుస్తోంది. వీడియో ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


రైల్వే స్టేషన్‌లో దొంగిలించగా మిగిలిన కాపర్ వైరు

చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి

చిలకలూరిపేట: సమాజ శ్రేయస్సుకు, ఉన్నత ఆశయ సాధనకు జీవితం అంకితం చేసిన కమ్యూనిస్టు యోధుడు చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామ సుబ్బాయమ్మ అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన చంద్ర రాజేశ్వరరావు బెనారస్ హిందూ యూనివర్శిటీలో కమ్యూనిస్టు సెల్ ఏర్పాటుకు నాంది పలికారని చెప్పారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు దృక్పథంతో సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలు నడిపినందుకు ఆయనకు సోవియట్ యూనియన్ ఆర్డర్ ఆఫ్ లెనిన్ అవార్డుతో సత్కరించిందని చెప్పారు. సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పేలూరి రామారావు, మహిళా సమాఖ్య కార్యదర్శి బి.లలితకుమారి, బొంతా భగత్ సింగ్, మేకపోతుల నాగేశ్వరరావు, తోట నరసింహ పాల్గొన్నారు.



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

సత్తెనపల్లి: కోడి పందేలు ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాజేష్ కుమార్ నేతృత్వంలో పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. సత్తెనపల్లి మండలం బృగుబండ శివారులో కోడి పందేలు వేస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఏడు సెల్‌ఫోన్‌లు, 22 ద్విచక్ర వాహనాలు, రూ.6,230 నగదు స్వాధీన పరుచుకున్నారు. దాడుల్లో సత్తెనపల్లి రూరల్ ఏఎస్‌ఐ కరీముల్లా, సిబ్బంది ఉన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

నరసరావుపేట టౌన్: అక్రమంగా మద్యం కలిగి ఉన్న కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి, అతని నుంచి రూ.85 వేల విలువైన తెలంగాణ మద్యం 112 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ నయనతార తెలిపారు. మంగళవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను ఆమె వెల్లడించారు. అందిన విశ్వసనీయ సమాచారం మేరకు గడియార స్తంభం వద్ద రజక వాడలో దాడులు నిర్వహించామన్నారు. అక్కడ అక్రమంగా మద్యం కలిగి ఉన్న అట్లూరి వెంకటరెడ్డిని అరెస్ట్ చేసి, అతని నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచామన్నారు.


మద్యం బాటిళ్లు, నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ నయనతార